# 4. పరువు ప్రతిష్ఠలు

సందు మొదట్లో వుండగా వానతుంపర ఆరంభమైంది. ఎలాగైనా తడవకుండా కొంప జేరుదామనే ఉద్దేశ్యంతో కామేశ్వర్రావు పరుగెత్తబోయి తన వయస్సు గుర్తుకురాగా నడకవేగం హెచ్చించాడు. మునిసిపాలిటీవాళ్ళు వెలిగించిన వీధి దీపాలు ఎనిమిదింటికే నిద్రపోతూన్నవి. చిమ్మచీకటిని చీల్చుకుంటూ ఉండి వుండి ఒక మెరుపు కాంతిని వెదజల్లుతూ వుంది. ఇలాటి మెరుపుల సహాయంతోనే, ఇప్పుడు నడుస్తున్నట్లే కామేశ్వర్రావు తన జీవితంలో కూడా నడుస్తున్నానని అనుకున్నాడు.

ఆకాశంలో పెద్దవానకు సూచనగా కారుమేఘాలు కమ్ముకున్నవి. క్షణ క్షణానికీ చినుకు పెద్దదవుతూనే వుంది. వొచ్చే వానకు హెచ్చరికగా ఉరుములు కూడా భయంకరంగా ఘీంకరిస్తూన్నవి. ఎక్కడన్నా ఆగుదామనే ఆలోచన వొచ్చింది కాని, ఆగినందువల్ల యీ వొచ్చే వాన త్వరలో పోదనే అభిప్రాయం కలిగి లాభం లేదనుకున్నాడు. తీరా వాన ఎడాపెడా కొట్టసాగాక, ఇక ఎల్లాగూ తడిశాం కదానని కామేశ్వర్రావు ధైర్యంగా, ఓటమి తెలిశాక తేలికైన మనస్సుతో నడవసాగాడు.

తడిసిపోతామని భయపడతాం కాని గగనాన్నుంచిపడే యీ చల్లని నిర్మలమైన నీరు శరీరం మీదపడి జారుతూవుంటే ఎంత హాయిగా వుంటుంది! షవర్‌బాత్‌కు నోచుకోని తనలాటివాళ్ళకు, ఇలాటి వానలో చేసే స్నానం ఎంత రిలీఫ్ ఇస్తుంది! ఉదయం పదినుంచి రాత్రి ఏడింటి దాకా వొంచిన నడుం ఎత్తకుండా కష్టపడే తనలాటివాడిని కరుణించి ఆ దేవుడే యీ వాన కురిపిస్తున్నట్లు తోచింది. ఎందుకంటే మామూలు షవర్ ఐతే శరీరాన్ని మాత్రమే శుభ్రపరిచి హాయిగా వుంచితే యీ నిర్మలోదకాలు మనస్సులోని దుమ్మునూ, ధూళినీ కడిగేసి తేలిక చేస్తూన్నవి. తలమీదనుంచి కారే నీరు మొహంమీదనుంచి జారుతూ రుచికూడా చెపుతోంది.

ప్రకృతిశోభను తిలకించి, ఆనందించి చాలా రోజులైనందువల్ల, యీ వానకు అతనిలో నిద్రాణంగానున్న కళాపిపాస మేల్కొంది. ఆ మైకంలో చిటికెలోనే తన ఇల్లు దాటిపోయిన సంగతి జ్ఞాపకమొచ్చి, వెనక్కు తిరిగాడు. ఇంటి ముందాగి, మరికొంచెం తడిశాడు. ఇప్పటికే ముద్దయిపోయినందువల్ల చలి ఆరంభమైంది. ఇక మాటదక్కదని యింటి తలుపు మీద గుద్దాడు.

తలుపు తెరవటం ఆలస్యమైనా యీనాడు కామేశ్వర్రావు విసుక్కోలేదు. బడలికంతా పోయి ప్రాణానికి హాయిగా వుంది. తుండుగుడ్డ తెప్పించుకుని తలా వొళ్ళూ తుడుచుకొని, తడిబట్టల్ని భార్యకు అందించి, పొడిగుడ్డలు కట్టుకున్నాడు.

సావిట్లో మసిబారిన లాంతరు తన జీవితంలాగే చీకటిని తరమలేక ఆయాసపడుతోంది. బైటి వాన చప్పుడు మినహాగా, ఇంట్లో అలికిడిలేదు. రోజూ యీపాటికి పద్మ చదువుకుంటూ, తమ్ముడి చేత చదివించేందుకు నానా అవస్థా పడుతూ వుండేది. భార్య గుమ్మం దగ్గిర తనరాకకోసం వేచి ఉండేది. కుర్చీలో కూర్చోగానే వాతావరణంలో చాలా మార్పు వొచ్చిందనిపించింది

"పిల్లలేరీ?" అన్నాడు.

భార్య వినిపించుకోనట్లు వూరుకుంది. ఆమెను పరీక్షగా చూశాడు; వర్షించేందుకు సిద్ధంగావున్న కారుమేఘం ఆమె ముఖంమీద ఆవరించి వుంది. మళ్ళీ ఏ చీరెకోసమో అలక ఆరంభమైనదేమో ననుకున్నాడు. ఇలాటి సందర్భాలు తనకు అలవాటే! తనేదో డబ్బంతా దాచుకుంటూన్నట్లు భార్యా, ఇద్దరు పిల్లలూ కూడా సూటీపోటీ మాటలంటూ తమ సంగతే చూడటం లేదనే ధోరణిలో ప్రవర్తిస్తూంటారు. వీళ్ళందర్నీ సంతృప్తి పరుద్దామనే సదుద్దేశ్యం తనకువున్నా, ఆర్థిక పరిస్థితుల వొత్తిడివల్ల అది వీలుపడటం లేదనే సంగతి తనెంత దీనంగా చెప్పుకున్నా వాళ్ళు అర్థం చేసుకొనే స్థితిలో ఉండరు. వారేమనుకుంటేనేం, రోజులు దొళ్ళించటమే గురిగా జీవితపు బరువు భారాల్ని లాగుతూనే వున్నాడు, మరి దారి లేనప్పుడు ఇంకేం చెయ్యాలి?

క్షణం క్రితం తేలిగ్గా వున్న మనస్సు మళ్ళీ బరువెక్కింది. జీవితం ఇంతేనేమో అనిపించే యీ వూసరవెల్లి రంగుల్నిచూసి, భ్రమించకూడదనుకుంటూనే సామాన్య మానవుడై తను పొరబాట్లు పడుతూంటాడు. తీర్చేవారుండాలి కాని యీ అలకలకేం భాగ్యం? ఇలాటి సందర్భాల్లో తనూ మౌనం వహించి, కొంత సీరియస్‌నెస్‌ను ముఖంలో కనబరుస్తాడు. తను చేయని నేరాన్ని వూహించుకొని తన మీద మండిపడే కుటుంబీకుల్ని గూర్చి, తనుకూడా వారు చేయని అనేక నేరాల్ని ఆరోపించుకుంటూ, తన బాధను వ్యక్తపరుస్తుంటాడు. ఇందువల్ల ఇద్దరు ఏడ్చేవాళ్ళకూ సానుభూతిచూపే మూడోవ్యక్తి లేనందువల్ల, తప్పనిసరిగా వాళ్ళిద్దరే రాజీపడే సిద్ధాంతం అమలు జరుగుతుంది.

– నిజానికి తనకీ బాధలన్నీ యీసంపాదనవల్ల కాదా? పెద్ద పిల్లకు పద్ధెనిమిదేళ్ళు నిండినా దానికి పెళ్ళిచేసే స్థితిలోలేదు. తాను స్కూల్‌ఫైనల్ వరకూ చదివి ఇంట్లో కూర్చుంది. దాని తరవాతివాడు సెకండ్‌ఫారం చదువుతున్నాడు. వాడికి చదువు అంటకపోతున్నా ప్రైవేటు చెప్పించే శక్తిలేక వూరుకున్నాడు. ఇంకా నయం – మరో ముగ్గురుపిల్లలు యీ బీదరిక బాధలు చూడలేక, తనను కరుణించి యీ ప్రపంచాన్నే వొదిలారు. ఆ రోజుల్లో వాళ్ళచావుకు విచారించాడు. కాని, వాళ్ళుకూడా బతికి వున్నట్లయితే యీనాటికి యెంత బరువయేవాళ్ళు!

నిద్ర మంచంమీదనుంచి లేస్తూనే లేమిని హెచ్చరించే గృహిణి, అడుగడుక్కూ తన బీదరికాన్ని చాటే జీవితం ఒక్కలా వున్నాయి. నిజానికి ఏ హిమాలయాపర్వతారణ్యాలకో జేరి తపస్సన్నా చేద్దామని లేదా సన్యాసుల్లో కలిసి దేశాటనం చేద్దామనే వూహ ఎన్నోసార్లు వచ్చింది. కాని కేవలం తన స్వార్థం చూసుకొని తన చేతకానితనాన్ని వైరాగ్యంగా మార్చి, బోడిగుండు చాటునా, కాషాయవస్త్రాల చాటునా దాచుకోవటం తేలికేకాని, తను కింద పారేసిన యీ సంసారం ఏమౌతుంది? వీళ్ళెలా బతుకుతారు? సంసార వ్యామోహం, రక్తస్పర్శ వున్న ఆత్మబంధువుల మీది ఆపేక్షలు తనను కదలకుండా కట్టివేసినవి. ఇంట్లో వున్నంతసేపూ ఏదో నరకంలో శిక్ష అనుభవిస్తూన్నట్లే వుంటుంది. ఎంత అలవాటు చేసుకున్నా ఓర్పుకుకూడా ఒక హద్దుండాలి కదా? సాధ్యమైనంత త్వరలో ఆఫీసుకు జేరుతాడు. కాని అక్కడ మాత్రం సుఖమేముందీ? తనకు ఇష్టంలేని పని, ఏడుస్తూనే చెయ్యాలి. జీతంకోసం చేయక తప్పదు. ఆఫీసులో కూర్చున్నంతసేపూ ఇంటికి వెళ్తే బాగుండుననిపిస్తుంది, ఇంట్లో వున్నంతసేపూ ఆఫీసే నయమనిపిస్తుంది. రెండూ ఎండమావులే ఐనా దాదాపు ప్రతిరోజూ రెండూ తనను భ్రమింపచేసి, మభ్యపెడుతూనే వున్నవి. యీ భ్రమే లేకుంటే జీవితం సాగదేమో?

ఆఫీసులో ఆఫీసర్‌ను మెప్పించటం ఎంతకష్టమో, ఇంట్లో భార్యను మెప్పించటం అంతకన్న తక్కువ కష్టంగా తనకు ఏనాడూ తోచలేదు. యీ రెంటిలోనూ తన అసమర్థత బైట పడుతూనేవుంది. బతకటమంటే తన బలహీనతల్ని, నిష్ప్రయోజకత్వాల్ని రుజూ చేసుకోవటంగానే కనిపిస్తోంది. మరీ తన స్థితి ఇంతకన్న బాగుపడే అవకాశాలు లేవని ఏనాడో అర్థమైనప్పటి నుంచీ, చాలా అణుకువగా, ఒదిగి వుంటున్నాడు. ఐతే ఇతరులకు యీ మెతకను మొత్తుతూ గౌరవించటంకూడా కొత్తకాదు.

తన బాధలు వీళ్లెవ్వరికీ అర్థంకావు. ఆ మాటంటే అదే మాటను భార్య తనకు అప్పగిస్తుంది. ఒకరికొకరు పరిపూర్ణంగా అర్థమవాలంటే వారు వీరుగా, వీరు వారుగా మారాలి. అది అసంభవం కనుక, అర్థమైనా కాకపోయినా నడక సాగించాల్సిందే! ఈ నిర్బంధం తన కొక్కడికే కాదు. ప్రపంచంలోని ప్రతివ్యక్తీ ఆచరణలో పెడుతూనే వున్నాడు. లేకుంటే ప్రపంచమే స్తంభించి పొయ్యేది.

ఎప్పుడన్నా కాస్త మూడ్ బాగుండే రోజున భార్య మరీ మితిమీరుతుంది. తను కాస్త సంతోషంగా ఉండేందుకు వీల్లేదని ఆమె అభిప్రాయం కావొచ్చు. తమందర్నీ యీ దుమ్ములో భూమిమీద వొదిలి, తను కాస్త పైఎత్తుకు వెళ్ళినట్లు అనుమానంవేస్తే, తనకాళ్లు పట్టుకొని లాగి తనతో పాటే భూమిమీదికి దింపటం ఆమె తత్వమనిపిస్తుంది. నిజానికి తను భూమి మీదనేవుండి, పిచ్చివూహల్తో కాస్త ఎత్తుకు వెళ్ళినట్లు భ్రమించి ఆ ఆనందాన్ని కనబరిస్తే ఆమె సహించలేదు. ఎలాగో కష్టపడి పండగరోజున అందరికీ కొత్తబట్టలు కుట్టించి, తను మాత్రం మాసికేసిన బట్టలు కట్టుకున్నప్పుడు కూడా "అయ్యో పాపం!" అన్నవాళ్ళు లేరు. తన నిజస్థితిని కుటుంబీకులే గమనించలేదు. యీపొత్తు లేకుండానే సంసార చక్రం దొర్లుతోంది.

మూడేళ్ళుగా భార్య కొత్త పాట మొదలెట్టింది! మరీ ఏడాదిగా వీలు దొరికినప్పుడల్లా ఆమె సాధిస్తూనే వుంది. అది పద్మ వివాహం. పెరిగి పెద్దదై నెత్తిమీద కూర్చున్న ఆడపిల్ల తల్లికి ఎంత బరువుగా వుంటుందో తెలియచెప్పటం దగ్గిర మొదలుపెట్టి జీవితంలో తను వివాహం చేసుకున్న నాటినుంచీ తను అనుభవిస్తూన్న కష్టాల్నీ, ఆయా ముఖ్యఘట్టాల్ని విడమర్చటం వరకూ, కర్మసిద్ధాంతాన్ని రుజూ చేసే ధోరణిలో మాట్లాడటం ఆమెకు పరిపాటయింది. తను కూతురి వివాహంచేసే స్థితిలోలేదు సరికదా, భార్యకు సమాధానం చెప్పేస్థితిలోకూడా లేదు. ఆ ఇన్‌షూరెన్సన్నా కట్టుతూ వుండినట్లయితే బాగుండేదనిపిస్తుంది; కాని పదేళ్ళ క్రిందటే వూడిన పాలసీ విషయంలో విచారించటంలో, అసలు తలుచుకోవటంలోకూడా అర్థంలేదు. దినదిన గండంగా గడిచే జీవితంలో భార్య శుభకార్యాలకు తావెక్కడ? అవి పంచవర్ష ప్రణాళికలు; యీనాడు అయ్యేదేమీలేదు. అసలు మానవుడికి లొంగని అనేక సమస్యల్ని, కాలమే తీరుస్తుందనే సిద్ధాంతా న్ననుసరించి, కామేశ్వర్రావు కూతురుపెళ్ళి సంగతి ఆ కాలానికే వొదిలి, చేతులు దులుపుకున్నాడు.

ఇంట్లో ఎక్కడా అలికిడిలేదు. ఇంట్లోవున్న సామానుల్తో పాటే వ్యక్తులు కూడా నిర్జీవులయ్యారేమోననిపిస్తోంది. భరించలేని నిశ్శబ్దం బరువుగా భరతనాట్యం చేస్తోంది. ఎలాగైనా ఏదో మిషమీద మాట్లాడితేనే కాని వూపిరాడేటట్లు లేదు. ముందు తామంతా బతికేవున్నామని తేల్చుకోవాలనిపిస్తుంది.

"భోజనానికి రండి" అంది భార్య.

కామేశ్వర్రావుకు ప్రాణగండం తప్పినట్లయింది. ఐతే ఆమె కంఠస్వరంలో గంతులేసే విషాదం, మాటల్లోని తీపిని చంపేసింది.

మాట్లాడకుండా బరువుగా లేచి, వంటింట్లోకి వెళ్లాడు. ఆమె వడ్డన చేసింది. ఎవ్వరూ మాట్లాడటం లేదు. ఏదో ఆకలి తీరేందుకు తింటున్నాడు కాని, రుచుల్ని విలువకట్టే స్థితిలోలేదు. తను మాట్లాడితే, ఆమె ఏదో సవాల్ లేవదీస్తుందని, దానికి

తాను సమాధానాలు చెప్పలేనని తెలుసు: తనంతట తానుగా మాట్లాడేందుకు కొత్త విశేషాలూ లేవు. నిశ్శబ్దమే ఎన్నుకోదగింది. అందుకనే త్వరగా భోజనం ముగించి బైటపడ్డాడు.

పిల్లలు ఏమైనట్లు? భార్య వంటిల్లు సర్దుతూన్న చప్పుడు వినిపిస్తోంది. మసిబారిన లాంతరు తీసుకొని పడకగదిలోకి వెళ్ళాడు. తను రోజూ పడుకునే ఆ పెద్ద నల్లుల మంచం మీద కుర్రాడు వేణు నిద్రపోతున్నాడు. పద్మకూడా నిద్రపోతోందేమో ననుకున్నాడు కామేశ్వర్రావు. కాని లాంతరు వెలుగుతో ఆమె నిశ్చలత భంగపడి ఆమె కదలటంతో తీవ్రాలోచనలో వుండి వుంటుందనుకున్నాడు. ఆమె ముఖం ఒక్క క్షణమే తనకు కనిపించింది! వెంటనే ఆమె అటుతిరిగి పమిటచెంగుతో ముఖం కప్పుకొని ముడుచుకొని పోయింది.

ఆ క్షణంలోనే సంవత్సరాల తాలూకు వ్యధ ఆమె ముద్దు ముఖంలో తాండవమాడినట్లనిపించింది. ఏదో పెద్ద ప్రమాదం, చెప్పుకునేందుకు భయపడేటంత ఘోరప్రమాదం జరిగివుండాలనిపించింది. అది ఏమిటో వెంటనే తెలుసుకోవాలనే ఆతృత దహిస్తున్నప్పటికీ, తెలుసుకొని ప్రక్రియ చేయలేని అసహాయ స్థితి నిరుత్సాహపరిచింది. ఆమెను అడగదలుచుకోలేదు. అలసివున్న తను ఎవర్నీ ఓదార్చే స్థితిలో లేడు. ఎవరికివారు ఓదార్చుకోవాలి. మరి తన పద్ధతి అదే!

మెదలకుండా సావిట్లోకి వొచ్చాడు. చాపవేసుకొని, ఒక తలగడ మీద తలమోపి, మొహం గోడవైపుకు తిప్పి, సన్నగా, జివ్వుమనేటట్లు చొరుచుకొస్తున్న చలిగాలినుంచి రక్షించుకునేందుకు చిరుగుల దుప్పటి ముసుగుపెట్టాడు. యింట్లో ఏం జరుగుతోందో శబ్దాన్నిబట్టి మాత్రం తెలుసుకోగలడు.

నిద్రపట్టించుకునేందుకు గుంజుకున్నాడు. రోజూ తొమ్మిదింటికే వొచ్చి తనను పలకరించిపొయ్యే నిద్రాదేవి, ఇవాళ ఇటు రానేలేదు. వానకు భయపడిందో, లేక ఆమెకూడా నిద్రపోతోందో తెలియలేదు. హాలులో మరోమూల చాపదులిపిన చప్పుడుతో భార్యకూడా పడుకున్నదని తోచింది. బరువైన నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ వాన కురుస్తూనే వుంది. హాయిగా నిద్ర పట్టాల్సిన వాతావరణంలో మనోవేదన ఆరంభమైంది.

కాలం బరువుగా సాగుతోంది. బైట వాన ఉధృతం తగ్గింది కాని నిద్ర రావటం లేదు. భార్య ఏం చేస్తోందోనని అటువైపు తిరిగాడు. ఆమె తననే పరీక్షగా చూస్తోంది. గుడ్డి వెలుగులో ఆమె ముఖం స్పష్టంగా కనిపించలేదు కాని, విషాదమేఘం అడ్డుకున్నదనే సంగతి తెలుస్తూనే వుంది. అసలేం జరిగింది? తెలుసుకుంటే బాగుండును. కాని తనంతట తనుగా అడగటం ఎలా?

బైట వాన ఆగిపోయింది. కాని తన ఆలోచనలు మాత్రం ఆగలేదు. భార్య మెల్లిగా లేచింది. తనతో రమ్మన్నట్లు సౌజ్ఞ చేసింది. "ఎందుకు" అందామనుకున్నాడు

కాని, తినబోతూ రుచి అడగటం దేనికని పిల్లల్లే లేచి ఆమెను అనుసరించాడు. ఆమె చప్పుడు కాకుండా వంటింటి తలుపు తీసి దొడ్లోకి దారితీసింది.

ఆకాశంలోని మేఘాలు తేలికై చకచకా సాగిపోతూన్నవి. యింతకుముందే ఉదయించిన చందమామ ఉత్సాహంగా పచార్లు చేస్తున్నాడు. చూరుబోరినుంచి పడే నీళ్ళచప్పుడు కర్ణోపేతంగా వుంది. వానకు తడిసిన చెట్లు హాయిగా వూగుతున్నవి. ప్రశాంతంగా, చల్లగా, మెల్లిగా వీచే గాలి జీవిత మాధుర్యాన్ని చాటుతూంది. ఇలాటి సమయంలో కామేశ్వర్రావు తనను తను మరిచిపొయ్యాడంటే వింతేమిటి? భారమైన సంసారంలో వున్న ఆనందాన్ని పొందేందుకు భార్యవైపు రెండు చేతులూ జాచాడు. సన్యాసి హఠాత్తుగా సంసారైనప్పుడు పొందే ఉద్రేకం ఆ చేతుల్లో ఇమిడి వుంది.

కాని ఆమె విసిరికొట్టింది. ఆమె ముఖ భంగిమ చూచేటప్పటికి కామేశ్వర్రావు నిషాగిషా దిగిపోయింది. ఆ తరువాత ఆమె గుసగుసలు ఆరంభించింది: కొంతసేపయ్యాక సన్నగా వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పసాగింది. కామేశ్వర్రావు మెదలకుండా తులసికోటకు ఆనుకొని అడ్డు ప్రశ్నలు వేయకుండా వినసాగాడు. వింటూన్న కొద్దీ అతని హృదయం భారమవసాగింది. క్షణికోద్రేకాలెన్నో అతన్ని ఆపాదమస్తకమూ వూపి వేసినవి... ఆమె మాట్లాడటం పూర్తయాక, తన ముఖంకూడా వివర్ణమై వుంటుందనీ ఆమె ముఖంలోని విషాదమేఘం లాటిదే తన ముఖాన్ని కూడా ఆవరించి వుంటుందనీ. తోచింది. నిస్సహాయుడు చేతులు పైకెత్తి ఆకాశంలో కూర్చొన్న భగవానుని సంబోధించిన రీతిగా, మోర పైకెత్తి అంబా అని బాధతో అరిచే ఆవువలె, కామేశ్వర్రావు ఆకాశంలోకి చూశాడు. పల్చని మేఘమొకటి చందమామను దూసుకుంటూ పోతూంది.

భూమికి అతుక్కుపోయినట్లు చేష్టలుడిగిన భర్తను ఆమె కదిపాక తిరిగి తనను తాను గుర్తించుకున్నాడు కామేశ్వర్రావు.

"నువ్వెళ్ళు....నేను వొస్తాను."

ఆమె బరువుగా అడుగులువేస్తూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

## 2

కామేశ్వర్రావు మనస్సు పరిపరివిధాల పారింది. అసలే హీనంగా లేమిలో కొట్టుకుంటూన్న హృదయం, పాతాళానికి అణగద్రొక్కబడింది. భార్య చెపుతూన్నప్పుడు ఆ జరిగిన ప్రమాదం ఏ ఇరుగు పొరుగుల యింటిలోనే అనే ధోరణిలో ఆరంభమై, క్రమంగా తన పునాదులే కదుల్తూన్న వనే జ్ఞానంలోకిదిగి వొణికిపొయ్యాడు. ఇప్పుడు ఆలోచించుకుంటూంటే ఆమె మాటల్లోని శక్తి అంతా ఒక్కసారి విడుదలై, ఆ వరదలో తను కొట్టుకొనిపోతూ వూపిరాడక, అలసిపోయి మునగ సిద్ధంగా వున్నట్లే తోచింది.

కలగాపులగంగా తనలో అశాంతికి కారణమైన అనేక వూహల తాలూకు ఆతృతను తగ్గించుకున్నాడు. ఉద్రేకాలవల్ల అయేదేమిటి? ఒకానొక ఉద్రేకం వల్లనేకదా యీ కుటుంబం ప్రమాదంలో చిక్కుకుంది? తలుచుకుంటే ఏడవాలనిపించింది కామేశ్వర్రావుకు. కాని కన్నీరు రాలేదు. జీవితంలో డబ్బుతోపాటే ఆ కన్నీటినికూడా అతను ఖర్చుపెట్టేశాడు. ఏడ్చి వొదిలించుకోవాల్సిన దుఃఖం హృదయాన్ని కమ్మి పీడించసాగింది. దాన్ని భరించే తీరాలి.

పద్మ! ఇంత అందమైన, తెలివిగల పిల్ల తన కూతురేనని అనేకసార్లు గర్వపడ్డాడు. పిల్లలంటే వుండే ప్రేమంతా ఆమెకే పంచిపెట్టాడు. తన మంచిరోజుల్లో ఆమె పుట్టటం వల్ల, ఆమె పుట్టాక కూడా తన రోజుల మంచిని పెంపొందించి ఆనంద నిలయమైంది. ఆ తరువాత పిల్లల మీద తన కంత మమకారంలేదు; చెడురోజుల్లో పుట్టారు. వాళ్లు తన ఇంట ప్రవేశించిన కాలం తనకు కలిసి రాలేదు. విచారించకపోయినా, మిగతావాళ్ళు పుట్టినందుకు తను సంతోషపడలేక పొయ్యాడు. యీ విధంగా తన పితృ హృదయంలో అత్యధికభాగం పద్మకే అంకితమైంది.

అలాటీతన ముద్దులబిడ్డ, పెరిగి పెద్దదై తన పరువు ప్రతిష్ఠల్నీ, వంశ గౌరవాన్నీ, తన వ్యక్తిత్వాన్నీ, కుటుంబ మర్యాదనూ మట్టిపాలు చేసేందుకు సాహసించింది! అప్పుదొరుకుతే, తను మళ్ళీ తీర్చగలనా లేదా అనే ఆలోచనకూడా లేకుండానే తీసుకొని పద్మకు పెళ్ళి చేయాలనే పట్టుదలతోనే, వున్నాడు తాను. ఆమె అత్తవారింటికి వెళ్ళిపోతే యీ యింటి కళ పోతుందే అన్న బాధ కూడా వుంది. ఐతేనేం లోకాచారాల్ని తను అనుసరించాలి కనుక ఆ బాధను భరించేందుకే నిశ్చయించుకున్నాడు. ఒక పక్క భార్య పోరుతూనే వుంది. కాని తనేం చేయగలడు? బీదవాళ్ళ బిడ్డ ఎంత అందంగా వున్నా, ఎంత తెలివిగలదైనా దాని విలువలు గ్రహించే సహృదయులు లేరు. విలువంటే రూపాయి అణా పైసలేకాని వేరు కాదాయె? ఆమెకు పెళ్ళిచేయకుండా, పెంచిన నేరం తనదేనని భార్య అభిప్రాయం. మరోదారిలేక తను పస్తాయించాడు. ఆ ఫలితంగానే పద్మ కాలుజారి, వంశ గౌరవమనే భవనం తాలూకు ఉనికికే మోసం తేవటంవల్ల, ఆ భవనమంతా తన మీద కూలింది.

పద్మను తలుచుకోగానే అరికాలిమంట నెత్తి కెక్కింది. బిడ్డలు ఎంత ముద్దయినప్పటికీ, వారు ప్రదర్శించే నైచ్యంవల్ల ఎంత శత్రువు లవుతారో కామేశ్వర్రావుకు యీనాడు అనుభవపూర్వకంగా తెలిసి వొచ్చింది. ఆ ఉద్రేకంలో పద్మను చంపేద్దామన్నంత కోపం వొచ్చింది. చచ్చిన ముగ్గురు పిల్లల్లాగే ఇదీ పోయినా బాగుండే దనిపించింది. కాని తను చదువుకున్నవాడు, సంస్కారం గలవాడు కనుక ఆ క్షణిక కోపోద్రేకాన్నుంచి ఎలాగో బైటపడ్డాడు.

ఇది, యీ పద్మ తన కంటికి పిల్లగానే కనిపిస్తూ తనకు తెలియకుండానే యవ్వన ప్రాంగణంలో ప్రవేశించి మాతృత్వాన్ని పొందుటకు సిద్ధమైంది. ఇదంతా తన

తప్పిదంగానే భార్య మాట్లాడుతుంది; కాని యీడొచ్చిన ఆడపిల్లల్ని ఒక కంట కనిపెట్టవలసిన బాధ్యత తల్లిగా ఆమెకు లేదా? యీ పొరపాటులో తన భార్యమాత్రం ఎందుకు భాగస్వామికాదు? ఐతే ఆమెతో వాదించటంవల్ల ప్రయోజనంలేదు; "నువ్వంటే నువ్వు" అనుకున్నందువల్ల సమస్య తేలదు.

ఎవరి తప్పయితేనేం ఎన్నిజాగర్తలు తీసుకున్నా, ఎంతగొప్పగా కాపలాలు కాచినా, లొంగకూడదని ఎన్ని ప్రమాణాలు తీసుకున్నా – ప్రకృతి మాత్రం ఎప్పుడో ఒకప్పుడు మెల్లిగా తన పని చేసుకుంటూనే వుంది. యీనాడీ సమస్యను ఎదుర్కొనేందుకు తను మొదటివాడు కాడు. పురాణయుగంలోనే శకుంతల కణ్వమునికి ఇలాటి సమస్యనే తెచ్చిపెట్టింది. కుంతీదేవి తల్లిదండ్రులదాకా పోకుండా, తనకు తానే సమస్యను పరిష్కరించుకుంది...కాని ఆనాటి వాతావరణం వేరు; యీనాడు వేరు, అంత తేలిగ్గా తను విడదీయలేడు.

ఐనదాన్ని గూర్చి విచారించి లాభంలేదు; దాన్ని తను మార్చలేడు – కాని కాబొయ్యే దాన్నిగూర్చే ఆలోచించాలి. తనేం చేయగలడు? డబ్బున్నా వుంటే ఇలాటి అసందర్భాలను ఎదుర్కోవచ్చు. ధనవంతులు గట్టి సిమెంటు కట్టడాల్లో వుంటారుకనుక ఇంట్లో జరిగే సంగతులు అంత తేలిగ్గా బజార్లోకి దూసుకొని రాలేవు. ఘూర్కా వాళ్ళ కాపలాలు బైటనుంచి ఇంట్లోకి ప్రవేశించేవాళ్ళను అరికట్టేందుకుకాదు; ఇంట్లో జరిగే అసందర్భాలూ, అనీతి కార్యాలు బైటికిపోకుండా కూడా కాపలా కాచేందుకు! కాని శిథిలావస్థలోవున్న తన యింటి గోడల రంధ్రాలగుండా యీ సంగతులు తేలిగ్గా బైటి ప్రపంచంలోకి వెళ్ళగలవు. తను వాటిని ఆటంకపరచలేడు.

ఉపాయంగా యీ అపాయాన్ని దాటటం ఎలా? అసలు యీ జరిగిన నేరానికి ఇద్దరు నేరస్థులున్నారు. ఇంతకుముందు తన పద్మ నేరస్థురాలనే ఉద్దేశ్యంతో ఆమెమీద మనస్సు కారాలూ మిరియాలూ కలేసి నూరింది...కాని ఆమెను వలలో వేసుకొని మాతృత్వాన్ని ప్రసాదించిన వాడి సంగతేమిటి? శిక్షపడే సందర్భంలో పద్మ ఎంత నేరస్థురాలో, వాడూ అంతేగా మరి? కాని వాణ్ణి సమాజం వొదిలేస్తుంది, పెద్దమనిషిగానే వాడు చలామణి అవుతాడు. చేసిన పాపానికి చిహ్నంగా పద్మ తన పాపతో ప్రపంచాన్ని ఎదుర్కోవాలి. ఇదీ న్యాయం.

తను యీనాడు యీ న్యాయసూత్రాల్ని మార్చలేడు. తర తరాలుగా అవి అవిచ్ఛిన్నంగా అమలు జరుగుతూనే వున్నవి. అదీగాక తన దాకా వొచ్చింది కనుక యీ న్యాయా న్యాయాల్ని గూర్చి విచారించాడు. కాని ఇంతకుముందు వాటి వూసేలేదు. కనుక ఉన్న సూత్రాల్లోనే ఎక్కడన్నా సందు దొరుకుతుందేమో చూసుకోవాలి.

అవతలివాడు సామాన్యుడా? పేరుపడ్డ ధనిక కుటుంబం లోనివాడు; లాయర్ శంకర్రావుగారి సుపుత్రుడు మురళి; అతను ఎలాటి వాడైనప్పటికీ, పద్మను అతనే

వివాహం చేసుకుంటే జరిగిన పొరపాటును అందరూ సరిదిద్దుకున్నట్లే అవుతుంది; మరి పేచీలేదు. కాని ఇది సాధ్యమా? యీనాడు మురళి ఏమంటాడో? అతని మాట ఎలా వున్నా శంకర్రావు ఏమంటాడో? బోలెడు కట్నంతో వొచ్చే సంబంధాలుండగా, యీ కన్యను, గర్భవతిని కోడలుగా స్వీకరించ గలిగిన హృదయవైశాల్యం ఆయనకు వుందా? ఏమైనా వాళ్ళ కాళ్ళా వేళ్లాపడి పద్మను వొదిలించుకోవాలి.

అది కానిపక్షంలో తనకు దారేమిటి? మరెవరికన్నా అంటకట్టాలి. ఆ తాహతే వుంటే ఆమె గర్భం ధరించక మునుపే సక్రమంగా పెళ్ళిచేసి వుండేవాడు కదా!... మొదటిది ఫలించకుంటే ముందంతా అగమ్యగోచరంగానే తయారవుతుంది. రాజమార్గాన్ని విడిచి దారి తెలియని అడివిలోకి పడటమవుతుంది. ఏమైనా ప్రయత్నించి చూడాలి.

మళ్ళీ పద్మ మీద మండిపోయింది. దీని దుంపతెగ - ఎంత పని చేసింది! సమాజపు ఆంక్ష లేకుంటే ఆమెను క్షమించగలిగే పితృహృదయం ఆ కట్టుబాట్లకు లొంగి, కఠినమైంది.

కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు. గుడ్డిలాంతరు తీసుకొని పడక గదిలోకి వెళ్ళాడు. పద్మ హాయిగా నిద్రపోతోంది. ఆమె ముఖం మీద తడి ఆరని కన్నీటిచారల్ని చూసేప్పటికి కామేశ్వర్రావు మనస్సు తరుగుకొని పోయింది. ఆమె పొందబొయ్యే యీ మాతృత్వానికి పితృత్వాన్ని వహించి, అంగీకరించి, నిలబడ గలిగిన వాడున్నట్లయితే, తనుకూడా ఆనందించి ఉండేవాడు. పువ్వుల్లో పెట్టి పూజించిన తన యీ సంతానం తనను నడిసముద్రంలో ముంచింది. ఏమనుకొని ఏం లాభం?

రకరకాల ఆలోచనల్తోనూ కామేశ్వర్రావు ఆ రాత్రి నిద్రాదేవితో విరోధంపూనాడు.

## 3

అనుకున్నట్లే శంకర్రావు ఒక పట్టాన లొంగే మనిషిగా తోచలేదు. తనతో రహస్యంగా మాట్లాడేందుకు ఒప్పుకున్నప్పుడే మొహం ముడుచుకున్నాడు. తీరా అంతా విన్నాక ఆయన నిర్లక్ష్యంగా నవ్వి వూరుకున్నాడు.

"మా వాడేనని ఎట్లా?" అన్నాడాయన.

మొహం పగలకొడదామా అనిపించింది కామేశ్వర్రావుకు. ఎక్కడో ఒకసారి కాలుజారిన వ్యక్తిని లోకమంతా చులకనగా చూడటం సామాన్యవిషయమే కావొచ్చు. కానీ తన కూతుర్ని మాట్లాడినట్లే ఆయన కొడుకునుగూర్చి తను మాట్లాడితే - అంటే, పద్మ ఒక్కతేనని ఎట్లా అని తను అడుగుతే? ఏం లాభం? శీలమనేది స్త్రీకేకాని పురుషుడిక్కాదాయె. తను ఉద్రిక్తు డవటంవల్ల తనకే నష్టం. ఎలాగైనా మనిషిని సమాధానపరచి, అవసరమైతే కాళ్లు పట్టుకోవాల్సిన సందర్భమాయె!

"మీవాడు రాసిన ప్రణయలేఖలున్నయ్, శాంపిల్‌గా వొకటి తెచ్చాను."

అందుకున్న లేఖను పూర్తిగా చదవకుండానే ఒక్కసారి పైనుంచి కిందిదాకా చూశాడు.

"సరే మా వాణ్ణి అడుగుతాను... ఇలాటిపని చేసేందుకు కోప్పడతాను" అన్నాడాయన.

"అందువల్ల జరిగేదేమిటి? కాని మీవాడు పితృత్వానికి కారకుడయ్యాడు..."

"కనుక-?" అన్నాడాయన కోపంతో.

"మీరు కోపగించుకోకండి. ప్రపంచంలో జరిగే అన్యాయాలను ఖండించి, న్యాయాన్ని సాధించే వృత్తిలో వున్నారు. వృత్తి ధర్మాన్ని మరువకండి. నాకూ నా కుటుంబానికీ జరిగిన యీ అన్యాయాన్ని మీరు ఎదిర్చినిలిచి, న్యాయాన్ని చేకూర్చగలరు. శాంతంగా ఆలోచించండి."

"బాగానేవుంది. మీరనేది – మీ అమ్మాయిని కోడలుగా చేసుకోమని! మీ అమ్మాయి కన్యాత్వాన్ని పాడుచేసుకోమని నే నెన్నడూ అనలేదు. ఆమె శీలాన్ని రక్షించుకోవలసినది మీరు; మీ నిర్లక్ష్యం వల్ల ఇది జరిగింది. దానికి నా బాధ్యతేమిటి?"

"మీ బాధ్యతా, నా బాధ్యతా అని కాదు. జరిగినదాన్ని మన మెవ్వరమూ మార్చలేము. మీ వాణ్ణి అడుగుతే మీకు నిజం తెలుస్తుంది. పెళ్ళి చేసుకుంటానని అమ్మాయిని నమ్మించాడు. తీరా యీ సమయంలో మొహం తప్పించాలనుకుంటే..."

"నమ్మించాడు! రాసిచ్చాడు!! పిచ్చిగా మాట్లాడకండి. అదంతా నిజమేనని యీనాడు మీరెలా రుజూచేస్తారు? పెళ్ళి కాకుండానే శీలాన్ని కోల్పోయిన స్త్రీ విలువ ఎంత? ఇక మా వాడంటారా – వాడు మొగమహారాజు!"

మొగవాళ్ళకు చాలా ఉపయుక్తంగా తయారైన నైతిక చట్టాన్ని మొగవాడైన కామేశ్వర్రావు మరే సందర్భంలోనైనా ఐతే చాలా మెచ్చుకొని ఉండేవాడు. ఉదాహరణకు ప్లీడర్ గారి కూతుర్ని తన కొడుకు గర్భవతిగా చేసివున్నట్లయితే, అప్పుడు యీ విషయ మంతా ప్లీడర్ గారికి తెలిసేది; ఆ మొగతనానికి తన కొడుకుతో పాటు, తనూ గర్వపడేవాడు. యీ మాటలు అందామని నాలుక చివరిదాక వొచ్చింది కాని, అందువల్ల యీ కాస్తగోడూ పోతుందేమోనని భయపడ్డాడు. ప్రవాహంలో కొట్టుకొని పోయ్యే తనకు, వొడ్డున వున్న శత్రువునైనా, బతిమాలి భంగపడాలే కాని, దూషించటమంటే మృత్యుదేవతను కావలించుకోవటమే. కనుక, ఎలాగైనా ప్లీడర్ గారి మనసు కరిగించేందుకే ప్రయత్నించాలి.

"పోనీ మీ వాణ్ణికూడా అడిగి చూడండి."

"అడుగుతానయ్యా. వాడు ఒప్పుకుంటేమాత్రం-?"

"అయ్యో! నేరం చేశామని తెలిసివుండికూడా దాన్ని ఒప్పుకోకపోవటం–"

"ఎవరు ఒప్పుకోవాలి? నేరం చేసిందీ లేనిదీ సాక్ష్యాల మీద, వాదనమీదా ఆధారపడేది కానీ, యీ సత్యాసత్య అన్వేషణలతో నిమిత్తమేమిటి? ఖూనీ కేసుల్లాటివే కొట్టివేయటం న్యాయశాస్త్రం తాలూకు వాదనల కారణంగానే కదా! అదంతా అలావుంచి, ఎలాగైనా మీ అమ్మాయిని మావాడికి అంటగట్టేందుకు యీ నాటకమంతా ఆడారని నేనంటే మీరేం సమాధానం చెపుతారు?"

ఈ అపవాదు వినేప్పటికి కామేశ్వర్రావు ఉగ్రుడయ్యాడు. పడాల్సిన మాటలన్నీ పడ్డాడు. ఏ నేరమైతే కనీసం తను ఊహించలేకపోయ్యాడో దాన్నే ఎదుటివ్యక్తి తనమీద రుద్దేందుకు సిద్ధమైనప్పుడు ప్రపంచంలో ఇంతకన్న దారుణం, అన్యాయం, అక్రమం ఎలా వుంటవో అర్థం కాలేదు.

"నేను దీనంగా వొచ్చి మిమ్ము ప్రార్థిస్తున్నాను. బిచ్చగాణ్ణి తరిమికొట్టే ధోరణిలో మీరు మాట్లాడుతున్నారు. ఇలాంటి కేసు వృత్తిధర్మంగా మీ దగ్గిరికి ఎవరైనా తెచ్చినట్లయితే, వేరువిధంగా మాట్లాడి, వారికి న్యాయాన్ని సాధించేందుకు నడుంకట్టి ఉండేవారు. ఇందులో మీరే ఒక పార్టీ అయ్యారు కనుక..."

కామేశ్వర్రావు మాట పూర్తికాకుండానే ప్లీడర్‌గారు కఠిన స్వరంతో అన్నారు: "యీ నీతులకేమొచ్చె? యింటి తలుపులు తెరిచి పెట్టుకొని, దొంగతనం జరిగాక, పోలీసుల్ని నిందించినట్లు మాట్లాడటం ఏం సబబు?... ఐనా మీతో వాద ప్రతివాదాలు జరిపే తీరిక నాకు లేదు..."

"అదేనా మీ జవాబు?"

"అదే..నేనీ సంబంధాన్ని ఏవిధంగానూ అంగీకరించలేను. అసలు మీ అమ్మాయి ప్రణయంలోపడే పెద్ద పెద్ద సంబంధాలొస్తే మా వాడు తోసేస్తున్నాడనేది ఇప్పుడు తెలిసింది. యీ సంగతి ఇదివరకే తెలుస్తే, నాకు జరిగిన నష్టానికి మీరు బాధ్యులయ్యేవారు....మాకుటుంబ గౌరవమర్యాదలూ పరువు ప్రతిష్ఠలూ ఆలోచిస్తే, యీ గర్భతిని పెళ్ళి చేసుకోమని అనేందుకు మీరు సాహసించరు...ఏం లాభంలేదు. మీ ఇష్టంవచ్చినట్లు చేసుకోండి" అని ఆయన లేచి వెళ్ళేందుకు సిద్ధమయ్యారు.

ఆయనింకా వాదప్రతివాదాల్ని జరుపుతాడనీ, తానింకా దీనంగా మాట్లాడి ఆయన్ను వొప్పిద్దామనే ఆశ కళ్ళ ముందే కూలిపోయింది. బతిమాలి, భంగపడి లాభంలేదు కనుక, బెదిరించి చూద్దామనుకున్నాడు కామేశ్వర్రావు.

"ప్లీడర్‌గారూ!" అన్నాడు. ప్లీడర్‌గారు ఆగి వినసాగాడు. "చూడండి! మీరన్నారే పరువు ప్రతిష్ఠలూ, కుటుంబ గౌరవమూ అని. అలాటివి ఎంత బీదవాళ్ళమైనా మాకూ ఉన్నవి: వాటిని కాపాడుదామనే యీ అవస్థంతాను..."

"జారిపోయినవిగా...ఇంక కాపాడాల్సిన శ్రమకూడా అనవసరం!" అని ఎగతాళిగా నవ్వాడు ప్లీడర్ గారు.

కామేశ్వర్రావు లెక్క చెయ్యలేదు.

"ఆ జారటం మీ సుపుత్రుని వల్లనే అని మరిచిపోతున్నారు. అదలా వుంచండి. యీ జరిగిందానికి మీవాడిదే బాధ్యతని నేను తేలిగ్గా రుజూ చేయగలను. ఉత్తరాలున్నవి. ఇరుగుపొరుగుల సాక్ష్యాలున్నవి. అన్నిటినీమించి, మీ వాడిది నిజమైన ప్రేమే కనుక ఐతే, దిగజారడు. అప్పుడైనా నాకు న్యాయం జరుగుతుంది కదా!"

"అంటే కోర్టుకు వెళ్తారా?"

"మరింకేం చెయ్యను? అన్యాయాల్ని ఎదిరించి న్యాయం చేకూర్చేందుకు తమలాటి ప్లీడర్లు మరికొందరు వున్నారుగామరి! కోర్టుకే వెళ్తే ఉభయులమూ ఎంత అభాసు కావాలో ఆలోచించండి. మీ రనుకునే కుటుంబ గౌరవం..."

యీ బెదిరింపులకు లొంగేరకం కాదు ప్లీడర్ గారు. రాజీ ఐతే వృత్తి బాగా సాగదు కనుక కోర్టుకు వెళ్ళటమే మంచిదని ఆయన అనేక మందికి సలహా లిచ్చాడు...కాని తనే కోర్టుకు ఎక్కాల్సి రావటాన్ని గూర్చి ఒక్క క్షణం ఆలోచించక తప్పలేదు. ఎవరిమీదన్నా ఆపరేషన్ చేసినంత ఉత్సాహాన్ని, తన మీదనే ఆపరేషన్ జరిపేప్పుడు చూపలేని డాక్టర్ పరిస్థితి లాటిది!

"మీరు కోర్టుకు వెళ్ళినా నేను నెగ్గగలను. అందుకు సందేహం లేదు. అసలు యీ గర్భానికి మావాడే కారణమని మీరు రుజూ చేయలేరు. మీరన్నారే కుటుంబ గౌరవం పోతుందని అది నాకుగాదు; మీకు. నాకు జరిగే హాని ఏమీలేదు. మా వాడికి పెళ్ళవదనే భయం మీకు అక్కర్లేదు. మీరెంత నష్టపడతారో ఆలోచించండి."

"నష్టపడేదేదో ఇదివరకే నష్టపడ్డాం. కాని న్యాయం జరపటం చేతుల్లో వుంచుకొని కూడా, మీలాటివారు ఇలా ప్రవర్తించటం భావ్యంగాలేదు."

"నేను అంతకన్న ఏం చెయ్యలేను. ప్లీడర్‌గా నా సలహా వినండి. మీరు ఏ విధంగానూ రుజూ చెయ్యలేరు. అనవసరపు ఖర్చులూ, శ్రమాను. పైన గౌరవమర్యాదల్ని బజారుకు ఎక్కించుకోవట మౌతుంది ....నా సలహా ఇది; ఏదో ఒక వెయ్యి ధర్మంగా యిస్తాను. ఇంకెక్కడన్నా సంబంధంచూసి అమ్మాయికి ముడిపెట్టండి. మీ సమస్యా, నా సమస్యా కూడా తీరుతయ్."

తన నేరాన్ని పక్కవాడి మీదికి నెట్టే ఉపాయంతోపాటు, తను సర్వశక్తులూ ఉపయోగించి పాకులాడే కుటుంబ గౌరవానికి రూపాయి అణా పైసల్లో ప్లీడర్‌గారు విలువ కట్టటాన్ని కామేశ్వర్రావు భరించలేకపొయ్యాడు.

"వెయ్యో పదివేలో కోర్టులోనే కక్కుదురు కాని" అని గొణుక్కుంటూ కామేశ్వర్రావు బైటపడ్డాడు.

విశాల ప్రపంచంలో పడ్డాక కోర్టూ, సాక్ష్యులూ, ప్లీడర్లు అడిగే చండాలపు ప్రశ్నలూ, నిద్రపోతూ వాద ప్రతివాదాల్ని విని, సంబంధం లేకుండానే తీర్పులు చెప్పే న్యాయమూర్తులూ, కుటుంబ గౌరవాల్ని వేలాంవేస్తూ, హేళనచేస్తూ వాటితో ఆడుకొని ఆనందించే న్యాయవాదులూ, యీ తమాషా అంతా చూస్తూ ఆ జరిగిన హాని ఇంకెవరికో కావటం వల్ల ఆనందించే ప్రేక్షకులూ మొదలైనవన్నీ కళ్ళకు కట్టి, తల తిరిగిపోయింది.

పద్మ చేసిన పనికి ఆమె మీద మండిపోతోంది. ఒకే నేరంచేసిన పదిమందిలో, మొట్టమొదట పట్టుబడిన వాడికి, మిగతా తొమ్మిదిమంది తాలూకు శిక్షకూడా విధించాలని ఆలోచించే పోలీస్ ఆఫీసర్ లాగు, పద్మను ఒక్కదాన్నే చంపి పారేస్తే యీ పీడ విరగడవుతుందేమోనని పించింది. యీ రకం ఆలోచనల్తో ఇంటికి వెళ్తే, ఆ ఉద్రేకంలో ఏ అఘాయిత్యమైనా చెయ్యొచ్చు. అప్పుడు పశ్చాత్తాప పడేందుక్కూడా ఆస్కారం వుండదు.

ఏం చేద్దామన్నా పాలుపోవటంలేదు. అంగబలమూ అర్ధబలమూ వుంటే.... అసలింతవరకూ ఎందుకొచ్చేది? ప్రపంచంలో ఏ జాతీ స్వజాతిని తినదు. పామూ, పులీ కన్నప్పుడు, కళ్ళు కనిపించక సంతానాన్ని తింటవనే ప్రతీతి వుంది. మిగతా జంతుజాల మంతటిలోనూ మానవుడు ఒక్కడే తోటి మానవుణ్ణి తింటున్నాడు. దాన్ని అరికట్టేందుకు బయలుదేరిన మానవులుకూడా, మానవులే కావటం వల్ల, వారి సహజగుణాల్ని విడనాడలేక పోతున్నారు...యీ తర్కంతో తనకు తేలేదేముందీ?

తనూ, తన వంశ గౌరవమూ ఎలానూ నాశనమైనవి. తను యింత కన్న చెడేదేమిటి? ప్లీడర్‌గారి వంశగౌరవం తాలూకు అంతుకూడాను కనుక్కుంటేనే కాని తనకు మనశ్శాంతి దొరకదు. ఎన్నిమాటలన్నాడు! ఎంత చులకనగా, హీనంగా చూశాడు! ఎలాగైనా యీ ప్లీడర్ని సాధించాల్సిందే! తనకు న్యాయం జరగనీ, జరగకుండనీ – అది వేరే సంగతి!

యీ నిశ్చయంతో తనకు స్నేహితుడైన ఒకానొక ప్లీడర్‌గారి యింటివైపు చకచకా నడవసాగాడు.

## 4

సివిల్‌దావా వెయ్యనే వేశాడు కామేశ్వర్రావు. న్యాయశాస్త్రంలో ఇది క్రిమినల్ సెక్షను కిందికి రాదు. మనిషిని మనిషి కొడితే, గాయపరుస్తే అయేమాత్రపు నేరమన్నా కాదు! బహుశా సహజంగా ప్రకృతి సిద్ధంగా జరిగేదే కనుక దీన్ని గూర్చి ఎవరూ తరిచి వుండరేమో? బిడ్డను కనేదాకా ఆగి, మొగబిడ్డ కనుక ఐతే ఆస్తిభాగంమీదికే పోవొచ్చన్నాడు లాయర్. కాని తనకు పరులసొమ్ము అపహరిద్దామనే దురుద్దేశ్యం మొదటినుంచీ లేదు. యీ లేనిదాన్ని శంకరంగారు వూళ్ళో ప్రచారం చేశారు. పద్ద

అపవాదు పడనేపడింది కనుక దానికి నష్టపరిహారంగా, ఆ లక్షాధికారి ఆస్తి పంచుకోవటం ఏ విధంగానూ అన్యాయ మనిపించలేదు.

కోర్టులో ఒకళ్ళ వంశాన్ని మరొకరు కడిగివేసుకొనే అవకాశం రాకుండానే రాజీ చేద్దామనే ఉద్దేశ్యంతో ఇరుపక్షాల మిత్రులూ చాలా ప్రయత్నించారు. శంకరంగారు ఎంతకూ ఏ నాలుగైదువేలో ఇచ్చేందుకు మాత్రమే సిద్ధపడ్డారు. కాని అంతకుమించి ఏమీ చేయలేనన్నారు. యీ మొత్తం తీసుకోవటం కేవలం తన ఆత్మాభిమానాన్ని వెలకట్టి అమ్ముకోవటమే అవుతుంది కనుక కామేశ్వర్రావు నిరాకరించాడు. తన ఆస్తికోసం ఎసరు పెట్టాడని శంకరంగారు చేసే ప్రచారంలో సత్యం వున్నదేమోనని కొంతమందికి అనిపించింది కూడాను.

"పోనీ మాననష్టం కింద ఏ పదివేలో అడిగి సరిపెట్టుకుందామా?" అని కామేశ్వర్రావు ప్లీడర్ అన్నాడు.

కామేశ్వర్రావుకు ఛర్రుమంది; "అదేంమాట? నేను డబ్బుకోసం యీ నీచకార్యానికి అంగీకరించాననేందుకు ప్లీడర్‌గారికి అవకాశం ఇవ్వటం లేదా?" అన్నాడు కామేశ్వర్రావు.

"అదికాదయ్యా! నీవు నష్టపడ్డావు. రేపు కోర్టులో ఐనా అమ్మాయికి భరణం ఇప్పిస్తారు..అంతేకదా?"

"మరి ఆ బిడ్డ సంగతేమిటి?"

"పోనీ మనోవర్తి. ఇవ్వాళ ఆ అబ్బాయి పెళ్ళి చేసుకోనంటే, కోర్టు వారు బలవంతగా పెళ్ళి చెయ్యరు మరి. 'లాలో' అలాటిది లేదు. నాకు ఇష్టంలేదని మొగాడు అంటే, ఆడదాన్ని వొదిలేసి ఆమె బతికేందుకు మనోవర్తి ఇప్పిస్తారు. కోర్టుదాకా పోకుండా..."

యీ వెధవ 'లా' తయారు చేసినవాడు తానిప్పుడున్న పరిస్థితుల్లో వున్నట్లయితే ఏది న్యాయమో నసాళం అంటేట్లుగా తెలిసివొచ్చేది!

"ఐందేమో ఐంది. ఇవ్వాళ కొత్తగా పొయ్యే పరువు ప్రతిష్ఠలు లేవు. యీ సంగతి వూరంతా తెలిసింది; ఇక దేశమంతా తెలిసినా నాకు భయమేమిటి?....కాని వంశ గౌరవాన్ని అమ్ముకోలేను; లేమితో చస్తాంగాక...అది వేరేసంగతి" అన్నాడు కామేశ్వర్రావు.

"కోర్టులో అవబొయ్యేదే, కోర్టుబైట అవుతూంటే నీకు కష్టమేమిటి?... ఇందులో చాలా తిరుగుళ్ళు ఉన్నయ్ భాయ్!" అన్నాడు లాయర్.

"ఏమిటవ్వి?"

"ముందు మనం మురళే పద్మ గర్భానికి కారణమని రుజూ చెయ్యాలి."

"అంటే అది నిజం కాదని మీరు సందేహిస్తున్నారా?"

"నేను నమ్ముతున్నానయ్యా! నిజాన్నికూడా కోర్టులో రుజూ చెయ్యాలి. రెండురెళ్ళు నాలుగంటే చాలదు. నాలుగు కాకుండా, ఇంకో టయేందుకు వీల్లేకపోగాక. అదే ఎలాగో చూపాలి."

"నిజాన్ని రుజూ చెయ్యటంలో ఇబ్బందేమిటి? అతను రాసిన ఉత్తరాలున్నవి. వీళ్ళిద్దరూ మా యింటిదగ్గరవున్న దేవాలయం వెనకాల కలుసుకొని మాట్లాడుతూండగా చూసిన వాళ్లున్నారు..."

"పిచ్చివాడివిభాయీ! ఉత్తరాలవల్ల ప్రేమించుకున్నారనే కాని, అంతకుమించి ఏమీ రుజూ కాదు; కలుసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ, అది పవిత్ర ప్రణయమని వాళ్ళంటే, కాదని ఎలా రుజూ చేయటం? మురళిని ప్రేమించినట్లే, ఇతరుల నెవరినన్నా, పద్మ ప్రేమించి ఉండకూడదా? అందుకు అవకాశం లేదా! యవ్వనంలోవున్న పిల్ల, సహజమైన ప్రకృతి వాంఛలకు లొంగిపోవటంవల్ల అవాంతరం జరుగుతే "ఫలానావారు" అనటం ఎలా?... ఇవన్నీ నాకు కలిగిన సందేహాలు కావు. రేపు శంకర్రావుగారు కోర్టులో చేసే క్రాస్ ఎగ్జామినేషన్. దాన్ని తట్టుకోవటం కష్టం. ఇవాళ పద్మ చెప్పే సాక్ష్యంకానీ, ఇతరుల సాక్ష్యం కానీ, మనకు అంత అనుకూలించదు."

కామేశ్వర్రావుకు బుర్ర తిరిగిపోతోంది. తీగె కదుపుతే కంపంతా కదిలి కంపరమెత్తించింది.

"ఐతే ఇది రాక్షసత్వం! వీళ్ళంతా రాక్షసులు. మానవ శరీరమనే బురఖాలో మానవులుగా చలామణీ అవుతున్నారు..." అన్నాడు ఉద్రేకంతో.

"ఏమైతేనేం నేను 'లా' పాయింట్లమీద మాట్లాడాల్సిందేకాని, సత్యా సత్యాలమీద మాత్రం కాదు. నికరంగా నేరంచేసిన వాణ్ణికూడా చేయలేదని నమ్మించేందుకు నాబుర్ర పనిచేస్తుంది. కాని, ఇది నిజం, కనుక దీన్ని రుజూ చేయమంటే కుదరదు...మనకు ఎప్పుడు వీలంటే..."

"ఎప్పుడూ?" అన్నాడు కామేశ్వర్రావు ఆదుర్దాగా.

"మురళి మన పక్షమైతే; వాడికి నిజంగానే పద్మ మీద ప్రేమ వుండి, అది నిర్మలమైనదైతే, పేచీలేకుండా తీర్పు మన పక్షమే అవుతుంది."

'ఏడ్చినట్లేవుంది' అనుకున్నాడు కామేశ్వర్రావు. ఆ మురళే అంత పెద్దమనిషైతే, తండ్రిని ఎదిరించైనా సరే వొచ్చి పద్మకు అండగా నిలబడి వుండాల్సింది! అప్పుడింక పేచీ ఏముందీ? కాకపోతే శంకరం గారి ఆస్తిలో భాగం వొచ్చేదికాదు; వెధవ ఆస్తికోసం తను లెక్కచేసే వాడు కాదు. కాని ఆ తండ్రికి కొడుకైన మురళిని మాత్రం నమ్మటం ఎలా? 'నేనుకాదు ఫో' అంటాడు వాడు. మేజరే ఐనా తండ్రి హయాం సాగుతోంది కనుక; నిజంగానే వాడికి పద్మంటే ప్రేమ వున్నప్పటికీ దాన్ని ఒప్పుకునేందుకు తండ్రి

సైంధవుడవుతాడాయే! ఐనా శత్రు పక్షంమీద ఆధారపడటం ఎలా? మురళి ఎలా వుంటాడో కూడా తను చూడలేదు.

యీ సంగతులన్నీ చెప్పి "ఐతే న్యాయం ఇదేనా?" అన్నాడు అమాయకంగా, కామేశ్వర్రావు;

"న్యాయా న్యాయాలు ఎవరి అంతరాల్లో వాళ్ళకే తెలుసు. కోర్టులో చర్చించబడి, నిర్ణయించబడే వాటి సంగతి వేరు."

కామేశ్వర్రావు మరేమీ చేయలేక నిట్టూర్చాడు. ప్రశాంతంగా ఆలోచించి, తెలివిగా ప్రవర్తించగల స్థితి దాటిపోయింది. పట్టుదల, క్రోధం, జరిగిన అన్యాయానికి గాయపడి ప్రతీకారాన్ని వాంఛించే దౌర్బల్యం, కనీసం తనతోపాటే సర్వనాశనమయే ప్రతిపక్షీయుల్ని చూసి పొందే తృప్తి మొదలైనవాటికి లొంగిపొయ్యాడు.

"ఆరు నూరు కానీండి, యీ కేసు నడవాల్సిందే. ఏమైనా సరే నేను లెక్క చేయను" అన్నాడు నిశ్చితకంఠంతో.

## 5

కోర్టుదృశ్యం విడ్డూరం చూడొచ్చిన వారికి బొత్తిగా రంజుగా లేకపోవటం వల్ల యీ కథ పెరిగే అవకాశం లేకపోయింది. కామేశ్వర్రావు మురళిని మొదటిసారి చూడగానే తనకు అల్లుడయే లక్షణాలన్నీ ఉన్నవనుకున్నాడు కాని, అది కోర్టుద్వారా జరుగుతుందో జరగదో అనుమానించాడు.

కోర్టుకు వొచ్చేటప్పటికి కామేశ్వర్రావు సగంచచ్చి వున్నాడు. పద్మ రానని మంకుపట్టు పట్టింది; ఏడుస్తూ కూర్చుంది. దాదాపు బలవంతాన లాక్కొచ్చాడు. యీ బలాత్కారం కోర్టులో కుదరదు. యీమె వాఙ్మూలం ఎంతవరకూ ఉపకరిస్తుందనే సందేహంకూడా ఏర్పడింది.

కామేశ్వర్రావు ప్లీడర్, మురళిని క్రాస్ పరీక్షలు చేశాడు. తనకూ పద్మకూ స్నేహం వున్నదనే కాని, తానామెను అనుభవించ లేదని మురళి చెప్పాడు. ఎన్ని విధాలుగా ప్రశ్నలు వేసినా అతను తత్తరపడలేదు. ఇంటి దగ్గిర తండ్రి భయపెట్టి, నూరిపోసిన సంగతులన్నీ అతనికి జ్ఞాపకం వున్నవి. అందుకనే తప్పుడు సాక్ష్యం కూడా అతని పెద్దమనిషితనాన్ని నిలబెట్టింది.

కామేశ్వర్రావు లాయర్ ప్రణయలేఖల్ని కోర్టువారి ముందు పెడదామనుకున్నాడు. కాని పద్మ వాటిని తగలబెట్టేసిందని తెలుసుకున్నాక సగం ఆశలు పోయినవి. యీ సందర్భంలో కామేశ్వర్రావుకు, పద్మను చంపి ఉరికంబానికి ఎగబాకినా బాగుండేదనిపించింది. దీనికి వాడిమీద ఇంత ప్రేమవుండటం అసహజమూ, నేరమూ

కాకపోవచ్చు కాని వాడికి తన మీద ఎంత ప్రేముందో క్షణమన్నా ఆలోచించకుండా అవివేకంగా ప్రవర్తించి, అసందర్భంగా తయారైంది! తనను నట్టేట్లో దిగవిడచిన వాడి పట్ల చూపే యీ ప్రేమ తాలూకు పవిత్రత ఎవడిక్కావాలి? దిగబడిన రొంపిలోనుంచి బైట పడేందుకు యీ ప్రణయం ఎందుకన్నా పనికి వొచ్చిందా మరి?

కామేశ్వర్రావు ప్లీడర్ కూడా పద్మను అనేక ప్రశ్నలు వేశాడు. "ఈయన్ను ఎన్నాళ్ళనుంచీ ఎరుగుదువు?" దగ్గిర మొదలెట్టి, రహస్య సమావేశాలు వరకూ లాగాడు. తమ మధ్య స్నేహం వుందనే వరకూ వొప్పుకొని, ఆపైన వేసిన ప్రశ్నలకు పద్మ జవాబులు చెప్పలేదు. ఒక పక్క అవమానంతోనూ, సిగ్గుతోనూ దహించుకొని పోతూ, మరోపక్క తన మూలాన సర్వనాశన మౌతూన్న కుటుంబ సౌఖ్యాన్ని కూడా లెక్క చేయకుండా ఆమె పెదవి కదపలేదు. తనమీద సమ్మె చేసిందనుకున్నాడు లాయర్. చాలా మధురంగా, సున్నితంగా అడిగాడు ప్రశ్నలన్నీ.

"నీవు గర్భవతివి. ఈ గర్భానికి ఎవరు కారకులు?"

పద్మ జవాబు చెప్పలేదు. ఒక్కసారి కోర్టులో గుమిగూడిన జనం వొంక దీనంగా, నిస్సహాయంగా చూసింది. తనను తాను రక్షించు కోవాలనే జ్ఞానం కూడా పోయిందామెకు.

"మురళితో నీవు దాంపత్యం చేశావా?"

యీ ప్రశ్నకు శంకరం తన అభ్యంతరాన్ని చెప్పాడు. ఇది ఆటోసజిషన్ అన్నాడాయన. కోర్టువారుకూడా యీ ప్రశ్నకు అభ్యంతర పెట్టారు.

"మురళి నీకు రాసిన ప్రణయలేఖల మాటేమిటి?"

పద్మ జవాబు చెప్పలేదు. లాయర్‌కు విసుగెత్తుతోంది: కామేశ్వర్రావుకు ఓర్పు నశించింది. ఇది తన కడుపున పుట్టవలసిందికాదు.

"మీ ప్రణయం తాలూకు పవిత్రతనుగూర్చి కోర్టువారు వినాలనుకుంటున్నారు." ఆమె మాట్లాడనందువల్ల కోర్టువారు వినలేకపొయ్యారు.

కామేశ్వర్రావు మొహంలో కత్తివేటుక్కూడా నెత్తురుచుక్క లేదు. ప్రాణం పోయిన రోగిదగ్గిర తన్నుకులాడే డాక్టర్ లాగున్న లాయర్‌నూ వంశగౌరవాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించని పద్మనూ వొదిలి, ఉత్తరీయంచాటున మొహం దాచుకొని బైటపడ్డాడు – కామేశ్వర్రావు.

తెల్లబడ్డ మీసాలను విజయగర్వంతో దువ్వుకుంటున్నాడు శంకరంగారు. కామేశ్వర్రావు ప్లీడర్‌కు కూడా విసుగెత్తింది. హఠాత్తుగా కూలబడ్డాడు.

వాయిదా వేయవలసిన పని లేనందువల్ల కేసు కొట్టివేయబడిందని తీర్పు చెప్పారు.

## 6

చీకటి పడింది. దూరానవున్న ఎలక్ట్రిక్ దీపాలు ప్రశాంతంగా పారే నదివొడ్డుల్ని మాత్రం లీలగా కనిపించేట్లు చేస్తున్నవి. పిల్లగాలికి వొడ్డు పట్టే అలల గలగల స్పష్టంగా వినిపిస్తోంది. చలిగాలి ఆరంభ మవటంవల్ల మనుషులెవరూ లేరు.

ఒక యువతి ఎత్తుగావున్న ప్రదేశంమీద నిలబడి, నదిలోకి దూకే ప్రయత్నంలో వున్నట్లు కిందికి చూస్తోంది. ఇంతలో ఒక యువకుడు వచ్చి ఆమెనడుం పట్టుకున్నాడు. వారిద్దరూ ఒకర్నొకరు గుర్తించుకున్నారు. ఆనాడు వింత చూసేందుకు కోర్టుకు హాజరైనవాళ్లెవరైనాసరే, యీ నాయకీ నాయకుల్ని తేలిగ్గా గుర్తుపట్ట గలిగేవాళ్ళు.

"పద్మా! క్షమించు" అన్నాడు మురళి.

ఆమె మాట్లాడలేదు. ముఖకళేమిటో స్పష్టంగా తెలియటంలేదు. కాని, దురంతర దుఃఖంలో నిశ్శబ్దంగానే ఏడుస్తోందని చెప్పవొచ్చు.

"పద్మా! పొరబడ్డాను...కుటుంబం తాలూకు పరువు ప్రతిష్ఠలనే మత్తులో మైమరచి, నాన్నకు లొంగాను. ఏ నేరమైతే చేసి, దాన్ని పంచుకునేందుకు భయపడ్డానో, నావొంతుకూడా నీవేభరించి ఎదిరి నిలిచావో, దాన్ని ఇందాక ప్రతిఘటించే సాహసం నాకు లేకపోయింది. కాని ఇప్పుడు నా నేరాన్ని కూడా భరించగలిగే ఆత్మవికాసాన్ని నీవు ఇచ్చావు; నా పొరపాటుకు ముందు క్షమించు. క్షమించానను..." ఆ కంఠస్వరంలో ఎంతో ఆవేదన, ఆతృత ఇమిడి ఉన్నవి. ఆమె నవ్వేందుకు వ్యర్థ ప్రయత్నం చేసింది. కంఠస్వరంలో దుఃఖపుతెరలు తగ్గలేదు.

అంది : "కుటుంబంతాలూకు పరువు ప్రతిష్టలకోసమే నేనూ పాకులాడుతున్నాను. నేనెలాగూ చెడ్డాను. నాతోపాటు మీరూ చెడటం వల్ల నాకు వొరిగేదేమీలేదు. పోతే మా కుటుంబ మర్యాదను కాపాడేందుకు యీనది ఒక రాజమార్గం! మనుషుల ఆత్మ గౌరవాల విలువ దీనికి బాగా తెలుసు"

"అలాటి మాటలనకు పద్మా! నీవు చేసిన మహోపకారానికి యీ జన్మంతా దాస్యం చేసినా చాలదు. పద్మా! నీవు నా భార్యవు. యీ పంచభూతాల సాక్షిగా, నా అంతరాత్మ తోడుగా, శతాబ్దాల తరబడి మానవుల మానమర్యాదల్నీ, ఆత్మగౌరవాల విలువల్నీ తెలిసిన యీ నదీమతల్లి బాసగా, ఇప్పుడు నేను ప్రపంచం ముందు నిలబడి యీ మాట అనగలను! నన్ను మానవుణ్ణిచేసిన దేవతవు నీవు: మానవుడిగానే బతకనిమ్మని ప్రార్థిస్తున్నాను."

ఆమె ఏడుస్తోంది. సంతోషంతో నవ్వాలని చేసిన ప్రయత్నం కూడా ఆ ఏడుపులో కొట్టుకుపోయింది.

"పద్మా! రా-"

"ఎక్కడికి?"

"చెప్తానుగా...రా...."

వాళ్ళిద్దరూ ఆ చీకట్లో ఎటో వెళ్ళిపొయ్యారు.

మూడురోజుల వరకూ పద్మ సంగతే ఎవరికీ తెలియదు. కామేశ్వర్రావు విచారించలేదు; అభిమానంగలదైతే ఆమె శవం ఎక్కడో ఎవరికో కనిపిస్తుంది లెమ్మనుకున్నాడు.

కాని శంకరంగారికి ఆదుర్దాగానే వుంది. కొడుకు కనిపించలేదు. వాడికి యీ ప్రణయంలో పిచ్చే ఎక్కిందో, బైరాగుల్లో కలిసి పొయ్యాడో తెలియదు. తన కొడుకుమీద వుండే ఆపేక్షవల్ల పద్మ సంగతి కూడా విచారించ సాగాడాయన. యీ పెళ్ళికి వొప్పుకున్నా బాగుండేదనిపించింది. పెద్దమనిషితనం చాలా ఆలస్యంగా తొంగిచూసి, దారి తప్పాక కనిపించే వెలుగులాగు మెరుస్తూ వుంటుంది కాబోలు!

దేశం నలుమూలలకూ వెళ్ళినవాళ్ళెవరి దగ్గిర్నుంచీ కబురులేదు. నాలుగోనాడు పత్రికలో మురళీ–పద్మలు వధూవరులుగా వున్న ఫోటో చూశాక శంకరంగారి గుండె దడతగ్గింది. వాడు బతికివుంటే అదే చాలనుకున్న క్షణాలున్నవి మరి!

రాయబారాలయ్యాక ఐదోనాడు కొడుకు కోడల్తో సహా యింటికి వచ్చాడు; ఉభయులూ శంకరంగారికి నమస్కరించారు. నోట మాట రాక ఆశీర్వదించారాయన.

"నాన్నా! నీవన్న కుటుంబ మర్యాదను పాటించే స్త్రీని చేసుకున్నాను. నీ ఆదర్శం ఆమె ఎంత గొప్పగా ఆచరించి నిలబెట్టిందో ఆనాడు కోర్టులోవున్న ప్రతివారికీ తెలుసు. నిన్నూ నన్నూ మన కుటుంబ గౌరవాన్నీ తన అవమానం చాటున, తన కుటుంబ మర్యాదను, చివరకు తన స్వార్థాన్ని కూడా ఆమె బలిచేసింది. ఇంతకన్న కుటుంబ గౌరవాన్ని కాపాడగలిగే వ్యక్తి యీ భూమిలో వుండదు..." అన్నాడు మురళి.

శంకరంగారికి ఒప్పుకోక తప్పలేదు. యీ కుటుంబ గౌరవం తరతరాలుగా నిలిపేందుకు గాను, వంశోద్ధారకుడు కలగాలని ఆయన మనస్సులో ఆశీర్వదించారు!

*రచన :- మార్చి, 1955*

తన కొడుకే పొరుగువాడి కన్న కూతురుకు గర్భాన్ని కలిగిస్తే వాడి పురుషత్వానికి పొంగిపోయే తండ్రి, పొరుగువాడి కొడుకు తన కూతురుకు గర్భాన్ని కలిగిస్తే కృంగిపోతాడు పాపం! మధ్య తరగతి పరువు ప్రతిష్ఠల అధోగతిని రచయిత కడిగి కడిగి విడిచిపెట్టారు.